'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## వాహన లైసెన్స్ చిక్కులు

**భారతదేశంలో** వాహనాలు నడిపే లైసెన్స్ పొందడం చాలా సులభం లేదా చాలా కష్టం. ఈ రెండింటిలో ఏదో ఒకటి నిజం అవుతుందని ఎవరైనా అనుకుంటారు. కానీ రెండూ నిజమే. అవినీతికి ఏ వైపు నుంచి చూస్తున్నారనేదాని మీద ఇదంతా ఆధారపడి ఉంటుంది. ప్రజలు పదోపరకో వదిలించుకుని పనులు కానిచ్చేసుకుందామని భావించే ప్రభుత్వ విభాగాల్లో రోడ్డు రవాణా ప్రాధికార సంస్థ (ఆర్టీఏ) ఒకటి. ఇటీవలి దశాబ్దాల్లో ఈ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వపరంగా చాలా చొరవలే అమలులోకి వచ్చాయి. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడంతో లుకలుకలు చాలావరకు తగ్గిపోయాయి. అయితే ట్రాక్ పరీక్ష మాత్రం ఆర్టీఏ సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారానే జరుగుతుంది.

ఇక్కడే ఏజెంట్లకు కొంత వెసులుబాటు లభిస్తుంది. దీన్ని కూడా సంస్కరించడం పెద్ద సమస్య ఏమీ కాదు. కానీ, ఏ మాత్రం అవకాశం దొరికినా సర్కారు విధులను ప్రైవేటుకు అప్పగించి చేతులు దులిపేసుకోవడం అలవాటుగా చేసుకున్న కేంద్రం మరోలా ఆలోచిస్తున్నది. డ్రైవింగ్ పరీక్షల నిర్వహణను పూర్తిగా ప్రైవేటుపరం చేసేందుకు నిబంధనలు కూడా రూపొందించింది. పాత నిబంధనల ప్రకారం ట్రాక్ పరీక్షలు ఆర్టీవో కార్యాలయ ఆవరణలోనే జరుగుతున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం ట్రాక్ పరీక్షల బాధ్యత గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూల్స్ ఆధ్వర్యంలో జరుగుతాయి. వారిచ్చే సర్టిఫికెట్ జత చేసి ఆర్టీఏకు దరఖాస్తు చేసుకుంటే లైసెన్స్ వస్తుంది. 2021లో నోటిఫై చేసిన ఈ వివాదాస్పద నిబంధనలను జూన్ 1వ తేదీ నుంచి అమలుచేయాలని కేంద్రం సంకల్పించింది. సమస్యను ఈ కొత్త ఏర్పాటు పరిష్కరిస్తుందా లేక మరింత జటిలం చేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నియంత్రణ కొరవడి ప్రక్రియ మొత్తం ప్రహసనంలా తయారవుతుంది. జవాబుదారీతనం సందేహంలో పడుతుంది. ప్రైవేటు ఫీజుల భారం వల్ల ప్రజలకు ఖర్చు తడిసి మోపెడయ్యే అవకాశమూ ఉంది. ఈ మొత్తం వ్యవహారమంతా గందరగోళానికి దారితీసే ప్రమాదం ఎంతైనా ఉన్నది. మరీ ముఖ్యంగా శిక్షకులు, పరీక్షకులు ఒకరే కావడం వల్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది.

కొత్త నిబంధనల ప్రకారం డ్రైవింగ్ స్కూల్స్ పెట్టాలంటే ఎకరం జాగా కార్యాలయానికి, రెండెకరాలు శిక్షణకు అవసరం అవుతుంది. ఇది ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదని చెప్పాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వంటి మహా నగరంలో అంతంత భూమి సేకరించడం సాధ్యమేనా? ఒకవేళ డబ్బున్నవారు పెట్టుబడులు పెట్టగలిగినా చిన్నచిన్న సంస్థలు మూసుకోవాల్సి రావచ్చు. దీనివల్ల వేలాది మంది రోడ్డున పడతారు. అన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే గుర్తింపు ఉంటుందని, సిబ్బంది తనిఖీలూ ఉంటాయని అధికారులు అంటున్నారు. ప్రైవేటును ప్రోత్సహించడానికి కేంద్ర రవాణా శాఖ ఆర్థిక సహాయ పథకం కూడా ప్రవేశపెట్టినప్పటికీ తీసుకునేవారు కరువయ్యారు. ఈ సమస్యల నేపథ్యంలో జవాబుదారీతనం, ఫీజుల నియంత్రణ, భద్రత అనే మూడు ఆందోళనలు ప్రముఖంగా ముందుకు వస్తున్నాయి. అందువల్ల వివాదాస్పద నిబంధనలు హడావుడిగా అమలు చేయడం కన్నా వాటిపై లోతైన అధ్యయనం జరపడం ముఖ్యమని చెప్పక తప్పదు.

# హత్యలు లేవు.. ఆత్మహత్యలు లేవు



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

> 2019 చైత్ర మాసం. గుమ్మడవెల్లి, సూర్యాపేట జిల్లా, ఏగిలువారంగ... ఊరాకిలి నడుమ నిల్పిన బొడ్రాయికి ఆడోళ్లంతా జల బిందెలు గుమ్మరిస్తున్నరు. పక్కన హోమ గుండం ఎగసెగసి మండుతున్నది. బ్రాహ్మణులు ఆవు నెయ్యితో అగ్నిహోత్రం చేస్తున్నరు. హక్కుదారి పూజారులైన బైండ్లవాళ్లు న్నరు కానీ, హంగామా అంతా అయ్యగార్లదే. డప్పుల దరువు.. కాళ్ల గజ్జెల నుడుగులతో ఊరు ఊరంతా జోరుమీదుంది. ఆలోచిస్తూ నడుస్తున్న..!

ఊరంచు చెలకల మీద చేతికొచ్చిన పజ్జొన్న కంకులు పైరగాలికి తెరలు తెరలుగా కదులాడుతున్నయి. చెలక మధ్య గుంపు చింతల కింద ఓ బక్క మనిషున్నడు. భుజం మీద ముతక గొంగడి.. గొల్లదుడ్డి కర్రను ఓ పక్క నేలకు పొడిచి, ఇంకో పక్క గదుమకు ఆనించి నిలబడ్డడు. గొర్లమందే లోకమున్న మనిషి. మంద పోకడను గమనిస్తున్నడు. పేరు అడిగితే..! వీరమల్లు అని చెప్పిండు. ఊరు ముచ్చటెల్లింది. ఊరు పొందిచ్చినోడు మొదలార. కడ్పులెంత ఇసం పెట్టుకొని బొడ్రాయి పాతిండో, నరుక్క సచ్చుడేగాని.. సేతికి అందొచ్చి నోడు లేకపాయే. అనుభవం చెప్పిండు. ఇగురంగ జెప్పె అని మాట కలిపితే..! ఓ బుచికారి నవ్వు నవ్వి నడుము తడుము కున్నడు. తోలు సంచిల నుంచి మోదుగాకు తీసి సుట్ట జేసిండు. జకమొక కొట్టి సుట్ట ముట్టించిండు. ఓ దమ్ము గట్టిగ గుంజి పొగ వదిలి తుపుక్కున ఊంచిండు. ఇక మొదలు పెట్టిండు. కేసీఆరొచ్చినంక నీళ్లు మల్లినయ్. సెర్వులు నిండినయ్. ఎద్దెగుసం పాణం బట్టింది గాని. అప్పటి ఊరు.. ఇప్పుడు మీరు చూసినట్టు ఉన్న ఊరుగాదు. పొద్దస్తమానం నరుక్కునుడు, సంపేసుకునుడే ఉండే. తెల్లారితే ఎవనింట్ల పీన్గెల్తదో. పొద్దూకితే ఎవని పెండ్లం ముండబోత్తదో అని లటన బతుకు బతికేటోళ్లం. ఓ గెట్టు కాడొచ్చిన పంచాతీ గాదు, ఓ జుట్టు కాడి పంచాతీ గాదు. తెలుగుదేశపోన్ని కాంగ్రెసోడు సంప, వీడు వాన్ని సంపుడు గియే కొట్లాటలు. బాయికాడికి పోదామన్నా.. ఇంట్లె పందామన్న భయమే. మూతి మీద మీసం పోసలు మొలిచిన పోరగాడు కనబడితే..! అటు ఆ సంఘపోడో...! ఇటు ఈ సంఘపోడో గుంజుకపోయిరి. మూతి మీద ఇంత పోసి.. కమ్మగ కూర పెడితే, మూడు నాలుగొద్దులకే పోరగాండ్లు తాగుడుకు మరిగిరి. మరువారం నుంచి ఎవడు పిలవకుండనే పోరలు జీతులిడ్వబట్టే. కూరపెట్టి, సారా పోసినోడే ఓ కత్తి సేతికిత్తే నరికొత్తుండే. ఇర్వై ముప్పై పీన్గెలు లేసుంటయ్. వాడకు, కాడుకు తొవ్వబడ్డది. ఊళ్లెకు పిల్లనియ్యాలంటే దడుసుకుందురు. బతకాలంటే ఇంత ఆదెర్వుండాలె. అంతో, ఇంతో భూమి సెల్కలున్నయ్ గాని ఏం ఫాయిదా. బరెంక బొక్కలేత్తానికి.. బోల గద్దలు ఆలటానికే బనికొచ్చేయి. ఊరు సుట్టు నాలుగు సెరువులున్నయి గాని నీళ్లెక్కడియి? పంటలు ఎక్కడియి? పోరగాడు బతకాలంటే ఇంకోన్ని సంపి ఈడు బతకాల్సి వచ్చింది.



కేసీఆర్ ఎక్కినంక సెరువులకు నీళ్లు మళ్లినయి. బోర్లిస్తే ఎలగటి పంటలకు ఇన్ని నీళ్లు దొరుకుతన్నయి. వానల మీద పునాస పండుతన్నది. ఊరుకు 600 గడపలున్నయి. అంచుకు పెద్ద సెరువు, అటుకెయ్యి మాలకుంట, ఇటుకెయ్యి నూనెకుంటలున్నయి. పెద్ద సెరువు కింద 250 ఎకరాల ఆయకట్టుంది. వంద మంది ఆయకట్టుదారులున్నరు. మిషన్ కాకతీయ పథకం కింద సెరువును బాగు జేయించిండ్రు. దానికి గోదారి కాల్వ (ఎస్సారెస్పీ) కలిపిండ్రు. పెద్ద సెరువు అలుగుళ్ల నుంచి కుంటలకు నీళ్లిచ్చిండ్రు. బావులకు నీళ్లు మళ్లినయి. జరంత ఎల్లుబాటు ఉన్నోడు అప్పోసప్పో చేసి బోర్లు ఏసుకున్నరు. ఆలుమగలు కష్టం జేసుకొని పంట తీస్తుండ్రు. రైతుబంధు అక్కరకొత్తన్నది. జాగ లేనోనికి కూలి దొరుకుతంది. ఎగుసం మీద నాలుగు రూపాయలు సేతుల కన్పడుతున్నయి. ఇంత ఉపాధి పని కూడా ఆసరా అయితంది. ముసలోళ్ల పింఛిని దానికో దీనికో అక్కరకొస్తున్నయి. జనం మంచిగనే బత్కుతున్నరు. వీరమల్లు చెప్తున్న కొద్ది ఆయన గుండెల్లో భారం దిగుతున్నట్టు తేలిక పడుతున్నడు.

నిజమే..! తుంగతుర్తి మండలం గుమ్మడవెల్లి ఊరు రాయలసీమను మించిన ఫ్యాక్షన్ పల్లె. 20కి పైగా హత్యలు జరిగినయి. అన్నీ రాజకీయ హత్యలే. ఆ ఊరి ప్రభావం చుట్టూత పల్లెల మీద పడ్డది. కుక్కడం, కొత్తగూడెం, సంగెం, అన్నారం, మద్దిరాల గ్రామాల్లో రాజకీయ హింస రేగింది. ప్రతి పల్లెలో నెత్తుటి ఏరులు పారినయి. స్వరాష్ట్రం ఫలించి, మిషన్ కాకతీయ రూపం పోసుకునే వరకు రాజకీయ కార్పణ్యాలతో తుంగతుర్తి పల్లెలు తల్లడిల్లేయి.

మైనర్ ఇరిగేషనే, మేజర్ ఇరిగేషన్ అని గట్టిగ నమ్మినోడు కేసీఆర్. కొలువు కూటాల మీదికొచ్చినంక చెరువుల పునరుద్ధరణకే తొలి ప్రాధాన్యం ఇచ్చిండు. మిషన్ కాకతీయ అని పేరు పెట్టి.. హరీశ్‌రావుకు బాధ్యత ఇచ్చిండు. రాష్ట్రంలో మొత్తం 46,531 చెరువులున్నట్టు గుర్తించారు. వాటిలో 12,000 గొలుసు కట్టు చెరువులు, 38,411 చెరువులు, మిగతావి చిన్న కుంటలని, వీటి కింద 24.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని నిర్ధారించారు. నాలుగు దశల్లో రూ.9,155 కోట్లతో 27,627 చెరువులను పునరుద్ధరించారు. వీటికి కాళేశ్వరం, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు, ఎగువ మానేరు, దిగువ మానేరు, కడెం, వరదకాలువ ప్రాజెక్టులను అనుసంధానం చేస్తే.. ఖమ్మం జిల్లాలోనూ సీతారామ, భక్తరామదాసు ఎత్తిపోతల, మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎలిమినేటి మాధవరెడ్డి పెండింగ్ ప్రాజెక్టుల కాల్వలను వాటి పరిధిలోని చెరువులకు కలిపితే.. చెరువు చుట్టూ జల పెరిగింది. జల ఇచ్చిన బలంతో 15.05 లక్షల ఎకరాల్లో పచ్చదనం విచ్చుకున్నది. వానపాములు కదలినయి.. చేపపిల్లలు ఈదినయి. పక్షుల జంటలు ఎగిరినయి. తాబేళ్లు భయం వీడి బండరాళ్ల సొరికల్లోంచి బయటకొచ్చి నీళ్లలో గంతులేసినయి. ముదిరాజులు వల విసిరి బుట్టలు నింపుకుంటున్నరు.. గట్టు మీది నుంచి పుల్లలు తెచ్చి పిట్ట తల్లి గూడు కట్టింది. గుడ్లు పొదిగింది.. కళ్లు తెరిచిన పిట్ట పిల్లలు చెరువు వైపే చూసి పసి రెక్కల్ని తపతపలాడించాయి. జీవావరణ పునఃసృష్టి జరిగింది.

**మత్తడి దునికి బీడు భూముల్లకు పారి, రాజకీయ హింసతో చిందిన నెత్తురును కడిగింది. ఒక్క తుంగతుర్తి పల్లెల్లో రాజకీయ హత్యలే కాదు.. యావత్ తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఆగినయి. కక్షలు కార్పణ్యాలు చెరువుల్ల నిమజ్జనం చేసి రైతన్నలు హలాలు పట్టి పొలాలు దున్నిండ్రు. బురద మడిల అమ్మలక్కలు పారాడి పారాడి నాట్లు వేసిండ్రు.. కలుపులు తీసిండ్రు.. కోతలు కోసిండ్రు. కుప్ప నూర్చితే..! భూమికే బరువయ్యేంత పంట పండింది. ఇది ఎంత వరకు అంటే..! 2022-23 నాటికి ఖరీఫ్, రబీ సీజన్ కలిపి ఏకంగా 1.22 కోట్ల ఎకరాలు సాగుకు అచ్చుగట్టి, 3 కోట్ల టన్నుల ధాన్యమిచ్చే ఆకుపచ్చ తెలంగాణకు హామీ ఇచ్చి కేసీఆర్ దిగిపోయారు.**

కొత్త పాలకులు వనరులు పొతం జేసి అన్నదాతకు మరింత జవం ఇస్తారేమో అనుకుంటే.. ఉన్న జీవం తీస్తున్నరు. సాగు మీద కేసీఆర్ సంతకాన్ని చెరిపే కుట్రలకు పాచికలు విసురుతున్నరు. అటు గోదావరి మీది కాళేశ్వరం ఇటు కృష్ణా మీది కల్వకుర్తి ప్రాజెక్టులు పండబెట్టిండ్రు. పంట భూములు ఎండబెట్టిండ్రు. చెరువులు నెర్రెలు బట్టినయి. యాళ్ల తప్పిన కరెంటయ్యింది. ఐదు నెల్ల కాపురం పదేండ్ల ఎన్కకుపోయింది.

కేసీఆర్ రాజనీతిజ్ఞుడు. పాణం, పట్టం ఎప్పటికీ స్థిరం కాదని నమ్మిన స్థితప్రజ్ఞుడు. రాచరిక చరిత్ర, రాజకీయ చతురత తెలిసిన జ్ఞాని. అందుకే జరుగబోయే భవిష్యత్తు విధ్వంసాన్ని, విపత్తును ముందే పసిగట్టినట్టున్నడు. 2015 మార్చి 12న అప్పటి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సదాశివనగర్‌లోని పాత చెరువులో మిషన్ కాకతీయకు అంకురార్పణ చేసినప్పుడే కేసీఆర్ ఒక విన్నపం చేశారు. అప్పట్లో కాకతీయ రాజులు వేసిన ఓ శిలా శాసన సారాంశాన్ని తన తొలి ప్రసంగంలోనే ప్రస్తావించారు. 'మా రాజ్యంపై దండెత్తి వచ్చే శత్రు రాజులారా! మమ్ముల్ని ఓడించి మా రాజ్యం గుంజుకున్నా సరే.. బురుజులు, కోటలు కూల్చినా సరే.. మనుషులను చంపినా సరే.. కానీ, మేము నిర్మించిన చెరువులను మాత్రం ధ్వంసం చేయకండి. అవి ప్రజలకు అన్నం పెట్టే జీవనాధారాలు' అని కాకతీయులు రాసిపెట్టినట్టు చెప్పారు. ఆ శిలాక్షరాలు నేటి పాలకులకు కనువిప్పు కావాలని ఆశిద్దాం.

## జయజయహే పాట వెనుక..



ప్రముఖ వాగ్గేయకారుడు అందెశ్రీ రాసిన ఈ పాట మొట్టమొదటిసారిగా 2004లో తెలంగాణ రచయితల వేదిక వెలువరించిన సాహిత్య సంచిక 'సోయి' (సంపుటి-1, సంచిక-2)లో అచ్చయింది. ఆ పాటలో భౌగోళిక, చారిత్రక చిహ్నాల ప్రస్తావన, తెలంగాణ సాహితీమూర్తుల అస్తిత్వ అంశాల ప్రస్తావన లేవనే ఒక వాదన వినిపించింది. అప్పట్లో ఉద్యమకారుల్లో దీనిపై చర్చ జరిగింది. ఫలితంగా పాటలో కవి ఆమోదంతో, కొన్ని మార్పుచేర్పులు జరిగాయి. ఇలా మార్చిన పాటను బీఆర్ఎస్ (టీఆర్ఎస్) 2004 ఎన్నికల సమయంలో క్యాసెట్‌గా మలిచి, విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది. ప్రజల్లోకి తీసుకుపోయింది. తర్వాత మరిన్ని అంశాలను చేరుస్తూ అందెశ్రీ ఈ పాటను 12 చరణాలకు పెంచారు.

### అందెశ్రీ మాతృగీతం

**పల్లవి:** జయజయహె తెలంగాణ
జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు
ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల
తల్లీ నీరాజనం
పది జిల్లాల నీ పిల్లలు
ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ
|| జయ ||

**చరణం: 1**
కవిగాయక వైతాళిక
కళలా మంజీరాలు
డప్పూడమొరుకము డక్కో
శారద స్వర నాదాలు
పల్లవులా చిరుజల్లుల
ప్రతి ఉల్లము రంజిల్లగ
అనునిత్యము నీ గానం
అమ్మ నీవు మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ
|| జయ ||

**చరణం: 2**
జానపదా జనజీవన
జావళీలు జాలువార
జాతిని జాగ్రుతపరిచె
గీతాల జన జాతర
వేలకొలదిగా వీరులు
నేల ఒరిగి పోతెనేమి
తరుగనిది నీ త్యాగం
మరువనిది శ్రమ యాగం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ
|| జయ ||

**చరణం: 3**
బడుల గుడులతో పల్లెల
ఒడలు పులకరించాల
విరిసే జన విజ్ఞానం
నీ కీర్తిని పెంచాల
తడబడ కుండా జగాన
తల ఎత్తుకొని బతుక
ఒక జాతిగా నీ సంతతి
ఓ యమ్మా వెలుగాల
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ
|| జయ ||

**చరణం: 4**
గోదావరి కృష్ణమ్మలు
తల్లినిను తడుపంగా
పచ్చని మాగానాల
పసిడి సిరులు కురువంగా
సుఖ శాంతుల తెలంగాణ
సుభిక్షంగా వుండాల
ప్రత్యేక రాష్ట్రానా
ప్రజల కలలు పండాల
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

*(సోయి సంచికలో అందెశ్రీ మాతృగీతం..)*

### తర్వాత మార్చిన వెర్షన్

జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ

పోతనదీ పురిటి గడ్డ రుద్రమదీ వీరగడ్డ
గండర గండడు కొమురం భీముడే నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోలుకొండ నవాబుల గొప్ప వెలుగె చార్మినారు
|| జయ ||



సిరివెలుగులు విరజిమ్మే సింగరేణి బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువుకు సింగారం
సహజమైన వనసంపద చక్కనైన పూవుల పొద
సిరులు పండే సారమున్న మాగాణమె కద నీ ఎద
|| జయ ||

జానపద జన జీవన జావళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృతిపరిచే గీతాల జన జాతర
అనునిత్యం నీ గానం, అమ్మ నీవె మా ప్రాణం
|| జయ ||

గోదావరి కృష్ణమ్మలు మన బీళ్లకు మళ్లాలె
పచ్చని మాగాణంలో పసిడి సిరులు పండాలె
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలె
స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణయుగం కావాలె
|| జయ ||

*(2004 ఎన్నికల సందర్భంలో టీఆర్ఎస్ రికార్డు చేసిన పాట)*

> తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంలో రాష్ట్ర పాలన పగ్గాలు కాంగ్రెస్ చేతుల్లో ఉండటం కాల మహిమగానే భావించాలి. ఒకరి కష్టం మరొకరి పాలైనట్టుగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్ర సాధనలో ఏ మాత్రం పాత్ర లేని కాంగ్రెస్ ఇప్పుడు చిలువలు పలువలుగా చెప్పుకోవచ్చు. పదిహేనేండ్ల అలుపెరుగని ప్రజల పోరును తన ఖాతాలో వేసుకొనే ప్రయత్నానికి కాంగ్రెస్ ఒడిగడుతోంది.

# ఉద్యమానికి నై.. సంబురానికి సై



బి.నర్సన్
94401 28169

ఆకలిని సైతం లెక్కచేయకుండా అటుకులు బుక్కి, పట్టు వదలక తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేసినవారు కాంగ్రెస్ నిర్వాకంతో ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన 2014 ఫిబ్రవరిలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నమాట వాస్తవమే కానీ, ఒక అనివార్య దశలో ఆ బిల్లును హస్తం పార్టీ ప్రవేశపెట్టిందనేది కాదనలేని వాస్తవం. తెలంగాణ ప్రజల ఉత్తుంగ ఉద్యమానికి తలొగ్గి తీసుకున్న నిర్ణయమది. ఆ మాత్రం దానికే 'తెలంగాణ ఇచ్చిన పార్టీ' అనే ట్యాగ్‌లైన్ తగిలించుకొని కాంగ్రెస్ గొప్పలకు పోతోంది. అంతేకాకుండా 'సోనియమ్మ మనసు కరిగి తెలంగాణ ఇచ్చారు' అనే దిగజారుడు మాటతో పాటు తెలంగాణ వాళ్లంతా ఆమెకు ఎంతో ఋణపడి ఉండాలి, నిత్యం కృతజ్ఞతా జపం చేయాలనే స్థాయిలో కాంగ్రెస్ నేతల మాటలు ఉంటున్నాయి. సోనియా తెలంగాణ తల్లి అని కాంగ్రెస్ వారు భజన చేస్తున్నారు తప్ప నిజానికి ఈ మాటను ఉద్యమ చరిత్ర తెలిసిన ఏ తెలంగాణ బిడ్డ కూడా అంగీకరించడు.

2004 నుంచి 2014 దాకా కేంద్రంలో కాంగ్రెస్ పాలనే సాగింది. ఆ కాలమంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేపట్టారు. విద్యార్థులు సమ్మెలు, ఆందోళనలు చేశారు. కవులు, కళాకారులు వేదికలెక్కి ప్రజల ఆకాంక్షను లోకానికి చాటారు. కాలయాపన వల్ల, గుండె కరగని పాలకుల వైఖరికి యువకులు బలిదానాల బాటపట్టారు. రోడ్లపై వంటావార్పులు, ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్, 42 రోజుల సకలజనుల సమ్మె మొదలైనవి తెలంగాణ సాధనకు మైలురాళ్లు. కేసీఆర్ నాయకత్వంతో పాటు ఉద్యోగులు, మేధావుల జేఏసీల మొక్కవోని పట్టుదల వల్లే కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణను సాధించుకున్నాం. కేంద్రంలో కాంగ్రెస్ పాలన ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంతంలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు తమ అధిష్ఠానాన్ని ఒప్పించి తెలంగాణను తేలేకపోయారు. కాంగ్రెస్ పెద్దలను నిలదీసే దమ్ము ఎవరికీ లేకుండే. రేవంత్‌రెడ్డి అప్పుడు కాంగ్రెస్‌లో లేరు, తెలంగాణను వ్యతిరేకించిన చంద్రబాబు వెంట ఉన్నారు.

ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఏపీ విభాగంపై ఆంధ్రా నాయకులదే పెత్తనం. వారిని ఎదిరించే శక్తి తెలంగాణలోని ఏ కాంగ్రెస్ నాయకుడికి ఉండేది కాదు. కాబట్టి తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను వారు కనీసం అసెంబ్లీలోనైనా లేవనెత్తలేకపోయారు. తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఢిల్లీ పెద్దలను గట్టిగా అడగలేకపోయారు. తెగించి మాట్లాడితే తమ పదవికే ఎసరు వస్తుందని భయపడిపోయారు. వారి చేతగానితనం వల్లనే తెలంగాణ ప్రాంతం ఎన్నో కష్టాలను, నష్టాలను అనుభవించాల్సి వచ్చింది. యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రాణత్యాగాలు చేయాల్సి వచ్చింది. ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసులు, సాయుధ బలగాలను ఉపయోగించారు అప్పటి పాలకులు. వేలాదిమంది లాఠీ దెబ్బలు తిన్నారు. వందలాది మంది జైలు జీవితం గడిపారు. యుద్ధం ముగిసి, విజయం సాధించాక తమ వల్లనే ఆ విజయం సాధ్యపడిందని అనడంలో ఔచిత్యమే లేదు.

**తెలంగాణ పదేండ్ల పండుగ కాంగ్రెస్ చేతులమీదుగా జరగడం తెలంగాణవాదులు, ఉద్యమకారులు జీర్ణించుకోలేని విషయం. అసలు ఈ విజయం తాలూకు ఘనత దక్కాల్సింది కాంగ్రెసేతరులకే. తెలంగాణ ఇచ్చింది తామేననే వల్లింపును పక్కనబెట్టి.. తెలంగాణ సాధనకు కృషి చేసిన వ్యక్తులను గుర్తించి, ఈ సందర్భంగా వారిని కలుపుకొని పోవాల్సిన అవసరం ఉంది. ఈ పండుగను రాజకీయాలకు అతీతంగా అందరి పండుగలా జరుపుకోవాలి.**

తెలంగాణ పదేండ్ల పండుగ నిర్వహణకు అన్ని వర్గాల భాగస్వామ్యంతో ఒక ఆహ్వాన కమిటీ వేయాలి. ఎలా నిర్వహించాలి, ఎవరిని సత్కరించాలనేది ఆ కమిటీ నిర్ణయించాలి. అధికారంలో కాంగ్రెస్ ఉన్నంత మాత్రాన ఆ పార్టీ గుత్తాధిపత్యం చెల్లదు. దీన్ని తెలంగాణ ప్రజలు కూడా హర్షించరు. అయితే కాంగ్రెస్ పెద్దల ఆలోచన మరోలా ఉంది. తెలంగాణ ఆవిర్భావం రోజు తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియాగాంధీని రాష్ట్రానికి రప్పించి, ప్రజల తరపున ఆమెను ఘనంగా సన్మానించాలన్న తన తలంపును కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల బయటపెట్టింది. తెలంగాణ రాకలో సోనియా పాత్ర ఎంత, ఏమిటి? అనే ప్రశ్నలకు భిన్నమైన వాదనలున్నాయి. పదేండ్లుగా యూపీఏ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆమె తెలంగాణ ఉద్యమంపై ఏనాడూ సానుకూలంగా స్పందించిన దాఖలాలు లేవు. ఆంధ్రా నేతల మాటలకే విలువనిచ్చారు. వారి అదిరింపులకు బెదిరిపోయారు కూడా. అందువల్లే తెలంగాణ బిడ్డల ప్రాణాలు పోతున్నా పట్టించుకోలేదు. చివరికి 2014 ఎన్నికల్లో నష్ట నివారణ కోసం తెలంగాణను ప్రకటించారు. ఇదంతా స్పష్టంగా తెలిసిన తెలంగాణ ప్రజలకు సోనియా పట్ల నిరసన భావమే తప్ప ప్రత్యేక గౌరవమేమీ లేదు. ప్రభుత్వపరంగా, ప్రజాధనంతో ఆమెను సత్కరించాలని ప్రజలు కోరుకోవడం లేదు.



ఉద్యమ సమయంలో తుపాకీతో రేవంత్‌రెడ్డి (ఫైల్)

రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే ఆయనకు తెలంగాణ ఉద్యమ ప్రస్థానం పట్ల పూర్తి అవగాహన లేదనిపిస్తోంది. 2006 నుంచి రేవంత్‌రెడ్డిది సొంత రాజకీయ విధానమే. రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు ఆయన ఎన్నడూ మద్దతు పలకలేదు. అవకాశవాదిగా, వ్యక్తిగత ప్రయోజనాలను ఆశిస్తూ, తన ఉన్నతికి అనుగుణంగా పార్టీలు మారుతూ నేడు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. ఏదో కసితో అర్థం పర్థం లేని మార్పులను చేపడుతున్నారే తప్ప ఒక్కో తెలంగాణ చిహ్నం వెనుక ఉన్న చరిత్ర ఏమిటనే ఆలోచన ఆయనకు ఉన్నట్టు అనిపించడం లేదు. ఈ సందర్భంగా 'రాష్ట్ర ఏర్పాటు ఎవరి వల్ల సాధ్యపడింది?' అని తెలంగాణ ప్రజలను అడిగి.. వారిలో ఎక్కువమంది ఎవరి పేరు చెబితే వారిని సత్కరించడం సముచితం.

## పంజాబ్ సల్వార్ కేరళలోనూ పాపులర్

*నాకు చీరలంటే చాలా ఇష్టం. నేను ఇక్కడ (పంజాబ్‌లో) చాలా తక్కువ చీరలను చూస్తున్నా. నిజాయితీగా చెప్పాలంటే చీరలను ఎక్కువగా ఇష్టపడే మా రాష్ట్రం కేరళలోనూ సల్వార్ కమీజ్ ఎక్కువగా ప్రాచుర్యం పొందింది. ధరించేందుకు ఇవి అనుకూలంగా ఉంటాయని నాతో చాలామంది మహిళలు అన్నారు. సల్వార్ కమీజ్‌లను కనిపెట్టినందుకు పంజాబ్ మహిళలను మనం అభినందించాలి.*

**- శశిథరూర్,** కాంగ్రెస్ సీనియర్ నేత

